

## ఎస్‌బీఐ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోనీ

న్యూఢిల్లీ: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీ నియమితులయ్యారు. ఎస్‌బీఐ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. బ్యాంకు మార్కెటింగ్, ప్రమోషనల్ కార్యక్రమాల్లో ధోనీ కీలకపాత్ర పోషించనున్నారని పేర్కొన్నది. ఒత్తిడి వేళలోనూ సంయమనం వహిస్తూ, చురుకుగా నిర్ణయాలు తీసుకోవడంలో ధోనీ సమర్థుడని తెలిపింది. కష్టమర్లతో, ఇతర భాగస్వాములతో ఎస్‌బీఐ అనుబంధం ఏర్పరచుకునే తీరు ధోనీ వ్యవహార శైలిలో కనిపిస్తుందని పేర్కొన్నది.

## మహారాష్ట్రలో 160 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

ముంబై: మహారాష్ట్రలో డీఆర్ఐ అధికారులు మరో భారీ డ్రగ్ రాకెట్‌ను ఛేదించారు. ఆదివారం ఛత్రపతి శంభాజీనగర్‌లోని ఒక ఫ్యాక్టరీపై దాడి చేసి ద్రవరూపంలో ఉన్న 160 కోట్ల రూపాయల విలువైన 107 లీటర్ల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అపెక్స్ మెడికెమ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శనివారం జరిపిన తనిఖీల సందర్భంగా ఈ లిక్విడ్ మెఫెడ్రోన్ గురించి బయటపడినట్టు అధికారులు తెలిపారు. ఇటీవల సింథటిక్ డ్రగ్స్ వాడకం అధికం కావడం, కొందరు పరిశ్రమల పేరిట ఇలా అక్రమంగా డ్రగ్స్ తయారీ పెరగడంతో దాడులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## మరాఠా కోటా ఇచ్చేదాకా నేతలు ఊరిలోకి రావొద్దు

అకోలా: మరాఠా కోటా ప్రకటించే వరకు తమ గ్రామంలోకి అడుగుపెట్టరాదని రాజకీయ నేతలపై మహారాష్ట్రలోని అకోలా జిల్లా చరణ్‌గావ్ గ్రామస్థులు నిషేధం విధించారు. తమకు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రాజకీయ నాయకులు అడుగుపెట్టకుండా నిషేధం విధిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. ఇలా నిషేధం విధించిన తొలి గ్రామం చరణ్‌గావ్ అని, రానున్న రోజుల్లో మరిన్ని గ్రామాలు కూడా ఈ జాబితాలో చేరుతాయన్నారు.

## 37 మంది భారత మత్స్యకారుల అరెస్ట్

రామనాథపురం, అక్టోబర్ 29: 37 మంది భారత మత్స్యకారులను శ్రీలంక నేవీ అరెస్ట్ చేసింది. రామేశ్వరం నుంచి 463 బోట్లు సముద్రంలోకి వెళ్లగా, అందులో ఐదు బోట్ల వారు తమ ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారన్న ఆరోపణతో 37 మందిని శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసింది. కాగా, మత్స్యకారుల అరెస్టును ఫిషర్‌మెన్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఇటీవల భారత మత్స్యకారులపై శ్రీలంక అధికారులు దాడులు చేయడం పరిపాటిగా మారిందని, కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

## ప్రయాగ్‌రాజ్‌లో 108 అడుగుల హనుమాన్ విగ్రహం

ప్రయాగ్‌రాజ్: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో యమునా నది ఒడ్డున త్రివేణి పుష్ప ప్రాంతంలో 108 అడుగుల ఎత్తయిన భగవాన్ హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. నగర కొత్వాల్‌గా పిలిచే హనుమంతుని విగ్రహంతో పాటు ఆలయ నిర్మాణానికి అక్కడ సుమారు 12 వేల చదరపు అడుగుల స్థలాన్ని ఇప్పటికే గుర్తించారు. మహా కుంభమేళా కంటే ముందే 2025లోగా దీనిని నిర్మిస్తారు. హరిద్వార్‌కు చెందిన పరమార్థ నికేతన్ త్రివేణి పుష్ప్‌ను 30 ఏండ్లకు లీజుకు తీసుకుంది. ఈ సంస్థ హనుమంతుని విగ్రహంతో పాటు పలు కట్టడాలు నిర్మించనున్నది.

## రైలు ఆలస్యం.. 60 వేల జరిమానా

కొచ్చి: సమయ పాలన పాటించనందుకు రైల్వేకు వినియోగదారుల ఫోరం రూ.60,000 జరిమానా విధించింది. 2018లో కార్తీక్ మోహన్ ఎర్నాకులం నుంచి చెన్నైకి టికెట్ బుక్ చేసుకున్నారు. అయితే నిర్దేశించిన సమయం కన్నా దాదాపు 13 గంటల ఆలస్యంగా రైలు వచ్చింది. రైలు ఆలస్యం కారణంగా అత్యవసర సమావేశానికి హాజరుకాలేకపోయానని మోహన్ ఫిర్యాదును ఫోరం సమర్థించింది.

# ఆపరేషన్ ఆకర్ష్!

## కర్ణాటకలో జోరుగా బేరసారాలు

- అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీ పాకులాట
- ఎమ్మెల్యేల కొనుగోలుకు తీవ్ర ప్రయత్నాలు
- ప్రజాసమస్యలను గాలికొదిలేసిన రెండు పార్టీలు



బెంగళూరు, అక్టోబర్ 29: కర్ణాటకలో విద్యుత్తు, నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కనీసం గంట కూడా వ్యవసాయానికి సరిగ్గా కరెంట్ ఇవ్వకపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. పొలాలు ఎండిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో ట్యాంకర్లతో పంట పొలాలను తడుపుతున్నారు. కరెంట్ కోతలకు నిరసనగా విద్యుత్తు కార్యాలయాల ముందు నిరసనలకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా సంక్షేమం కోసం పనిచేయాల్సిన అధికార కాంగ్రెస్.. ప్రజా సమస్యలను ఎత్తిచూపి వాటి పరిష్కారానికి కృషిచేయాల్సిన ప్రతిపక్ష బీజేపీ.. రెండూ అధికారం కోసం పాకులాడుతున్నాయి. రాష్ట్రంలో ఆపరేషన్ హస్త, ఆపరేషన్ లోటస్ జోరుగా సాగుతున్నది. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన రెండు పార్టీలూ.. ప్రత్యర్థి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంపైనే దృష్టి సారించాయి.

**డీకే బహిరంగ ప్రకటనలు**

వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలకుగానూ మెజార్టీ స్థానాల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ పార్టీ బీజేపీతో పాటు ఇతర పార్టీల నేతలకు గాలం వేసే ప్రయత్నాలు చేస్తున్నది. పార్టీని 20కి పైగా లోక్‌సభ స్థానాల్లో గెలిపించుకోవడం ద్వారా ప్రస్తుత డిప్యూటీ సీఎంగా ఉన్న రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్.. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుర్చీకి ఎసరు పెట్టి, తర్వాతి రెండున్నర ఏండ్ల టర్మ్‌కుగానూ సీఎం పదవి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరే ప్లాన్‌లో ఉన్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్ష పార్టీల్లోని నేతలను కాంగ్రెస్‌లోకి తీసుకురావాలంటూ డీకే శివకుమార్ బహిరంగంగా తమ పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో అధికార కాంగ్రెస్‌లో పవర్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. సీఎం కుర్చీని కాపాడుకొనేందుకు అటు సిద్ధరామయ్య, దాన్ని లాక్కొనేందుకు ఇటు డీకే ఎవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. తమ వర్గం మంత్రులు, నేతలతో చర్చలు జరుపుతూ.. ఒకరికి ఒకరు చెక్ పెట్టేలా పావులు కదుపుతున్నారు.

**ఎమ్మెల్యేల కొనుగోలుకు యత్నాలు**

మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు పూర్తి మెజార్టీ ఉన్న నేపథ్యంలో ఇది దాదాపు అసాధ్యమైనప్పటికీ, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని, అయితే అది సాధ్యం కాదని డీకే శివకుమార్ ఇటీవల పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ప్రముఖ నాయకులు ఉన్నారని వ్యాఖ్యానించారు. 224 అసెంబ్లీ స్థానాలు ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్‌కు 136 ఉండగా.. బీజేపీ ఎమ్మెల్యేలు 66 మంది, ఇటీవల ఆ పార్టీ పొత్తు కుదుర్చుకొన్న జేడీఎస్‌కు 19 మంది శాసనసభ్యులు ఉన్నారు. 113 మెజార్టీ మార్క్ కాగా బీజేపీ, జేడీఎస్‌లకు కలిపి 85 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

**50 కోట్లు.. మంత్రి పదవి ఆఫర్**

కాంగ్రెస్ ఎమ్మెల్యే గనిగా రవి ఇటీవల కమలం పార్టీపై సంచలన ఆరోపణలు చేశారు. తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, పలువురు తన సహచర ఎమ్మెల్యేలకు రూ.50 కోట్లతో పాటు మంత్రి పదవి ఆఫర్ చేశారని అన్నారు. బీజేపీ పేరు ప్రస్తావించకుండా.. 'వారు ఇప్పటికే నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలిసి మాట్లాడారు' అని ఆరోపించారు. మైసూర్ రీజియన్‌కు చెందిన ఓ ఎమ్మెల్సీ, బెళగావికి చెందిన ఓ మాజీ మంత్రి, మాజీ సీఎం యెడియూరప్పకు అత్యంత సన్నిహితులు ఈ ఆఫర్లు ఇచ్చారని, ఇందుకు తన వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ ఖండిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం తమకు లేదని, ఇప్పటికే కాంగ్రెస్‌లో అనేక గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నది.

### సిద్ధరామయ్య అంతర్గత భేటీ

సీఎం సిద్ధరామయ్య శుక్రవారం రాత్రి తన సహచర మంత్రులతో అంతర్గతంగా విందు సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఈ సమావేశంలో మంత్రులు జీ పరమేశ్వర, హెచ్‌సీ మహదేవప్ప, సతీశ్ జార్ఖిహోళి హాజరయ్యారు. డీకే శివకుమార్ లేకుండా ఈ భేటీ జరుగడం ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్టు అయింది. సీఎం పీఠాన్ని దక్కించుకొనేందుకు డీకే చేస్తున్న ప్రయత్నాలను, ఆయన పెట్టుకొన్న ఆశలను అడ్డుకొనే ప్రయత్నంలో భాగంగా సీఎం సిద్ధరామయ్య పావులు కదుపుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరమేశ్వర నివాసంలో ఈ భేటీ జరుగ్గా.. సమావేశంలో సీఎం సీటు పంపకంపై చర్చ జరిగిందని, డీకేకు సీఎం పదవి కట్టబెట్టేందుకు సిద్ధరామయ్య అనుకూలంగా లేరని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అధిష్ఠానం సీఎం సీటు షేరింగ్ చేపడితే తదుపరి సీఎం అభ్యర్థిగా పరమేశ్వర పేరు ఈ భేటీలో చర్చకు వచ్చినట్టు తెలిసింది.

# రాజస్థాన్‌లో జాట్-దళిత్ పొత్తు

- అసెంబ్లీ ఎన్నికల్లో జట్టు కట్టిన ఆర్ఎల్పీ, ఏఎస్పీ
- 40కి పైగా స్థానాల్లో ప్రభావం
- అధికార కాంగ్రెస్, బీజేపీలలో దెబ్బ ఎవరికో?



బేనివాల్, చంద్రశేఖర్ ఆజాద్

జైపూర్, అక్టోబర్ 29: రాజస్థాన్‌లో జాట్ పార్టీగా పేరుపొందిన హనుమాన్ బేనివాల్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ(ఆర్ఎల్పీ), భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ(ఏఎస్పీ) మధ్య పొత్తు కుదిరింది. ఈ జాట్-దళిత్ కలయిక అసెంబ్లీ ఎన్నికల్లో 40కి పైగా స్థానాల్లో ప్రభావం చూపే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో జాట్లు, దళితుల ఓట్లు ఉన్నాయి. రాజస్థాన్ జనాభాలో దాదాపు 10 శాతం జాట్లు ఉండగా, దళితులు దాదాపుగా 18 శాతం ఉంటారని అంచనా. కనీసం రాష్ట్రంలోని 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ కమ్యూనిటీ ఆధిపత్యం ఉంటుందని, పలు ఇతర స్థానాల్లో కూడా ప్రభావం చూపుతుందని రాజస్థాన్ జాట్ మహాసభ గతంలో పేర్కొన్నది. తాజాగా ఆర్ఎల్పీ, ఏఎస్పీ పొత్తు ప్రకటన సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌కు బలమైన ప్రత్యామ్నాయం అవసరమని, రైతులు, జవాన్లు, దళితులు కలిసి రావాలని అన్నారు. కాగా, ఆజాద్ సమాజ్ పార్టీ ప్రధానంగా రాష్ట్రంలోని బీఎస్పీ ఓటు బ్యాంకుపై దృష్టి పెట్టింది.





**ఆ ఓట్లపైనే ప్రధాన దృష్టి**

2018 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన 3.56 కోట్ల ఓట్లలో దాదాపు 76 లక్షల ఓట్లు(21.34 శాతం) అటు బీజేపీకి గానీ, ఇటు కాంగ్రెస్‌కు పడలేదు. ఇప్పుడు ఈ ఓట్లపైనే ఆర్ఎల్పీ, ఏఎస్పీ కూటమి ప్రధానంగా దృష్టి పెట్టింది. గత ఎన్నికల్లో 58 స్థానాల్లో పోటీచేసిన ఆర్ఎల్పీకి మొత్తంగా 8.5 లక్షల ఓట్లు వచ్చాయి. మూడు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా, వారిలో ఇద్దరు దళితులే. ఇక రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి సారిగా బరిలోకి దిగిన ఏఎస్పీ.. సొంతంగా కొన్ని స్థానాల్లోనే పరిమితంగా ప్రభావం చూపుతుందని విశ్లేషకులు మొదట అంచనా వేశారు. అయితే ఇప్పుడు ఆర్ఎల్పీ, ఏఎస్పీ జట్టు కట్టిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌లకు ఈ జాట్-దళిత్ కలయిక దెబ్బ కొట్టే అవకాశం లేకపోలేదని పేర్కొంటున్నారు.

## కూటమి పార్టీలతో కాంగ్రెస్‌లో గుబులు

**మధ్యప్రదేశ్‌లో విడివిడిగా ఇండియా కూటమి పార్టీల పోటీ**

భోపాల్, అక్టోబర్ 29: వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించడమే లక్ష్యంగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఏర్పాటుచేసిన 'ఇండియా' కూటమిలో ఐక్యత కొరవడింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు వేటికవే సొంతంగా బరిలోకి దిగుతున్నాయి. కాంగ్రెస్‌కు పొత్తు కుదరక సమాజ్‌వాదీ పార్టీ, జేడీయూ, ఆప్ సొంతంగా పోటీచేస్తున్నాయి. దీంతో కూటమి పార్టీలతో కాంగ్రెస్‌కు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో ఇండియా కూటమి పార్టీలైన ఆప్, సమాజ్‌వాదీపార్టీ, జేడీయూ 92 సీట్లలో బరిలోకి దిగుతున్నాయి. ఇండియా కూటమి పొత్తు కేవలం పార్లమెంట్ ఎన్నికలకే తప్ప అసెంబ్లీ ఎన్నికలకు కాదంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటన ఇప్పుడు ఆ పార్టీ మెడకు చుట్టుకుంటున్నది.

### 'నోటా'ను రద్దు చేయాలి: బఘేల్

రాయ్‌పూర్: ఎన్నికల్లో నోటా ఆప్షన్‌ను రద్దు చేయాలని ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ డిమాండ్‌చేశారు. బరిలో నిలిచిన అభ్యర్థుల్లో తమకు ఎవరూ నచ్చకపోతే ఓటర్లు 'నోటా'కు ఓటేసే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. నోటా ఆప్షన్‌పై బఘేల్ మాట్లాడుతూ.. కొన్ని సందర్భాల్లో అభ్యర్థుల విజయం, ఓటమికి మధ్య ఉన్న తేడా ఓట్ల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పోలైన సందర్భాలు ఉన్నాయని, ఇది అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతున్నదన్నారు.

### కరెంటు ఇవ్వలేదని ఎన్నికల బహిష్కరణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): మంచినీరు, విద్యుత్తు లాంటి కనీస వసతులు కల్పించటంలో బీజేపీ, కాంగ్రెస్‌లు విఫలమయ్యాయని.. ఇందుకు నిరసనగా రానున్న ఎన్నికల్లో ఓటేయొద్దని ఛత్తీస్‌గఢ్‌లోని రెండు గిరిజన గ్రామాల ప్రజలు తీర్మానించారు. రాంపూర్ అసెంబ్లీ పరిధిలోని కెరాకఛార్ గ్రామ పంచాయితీలోని సార్‌డీహ్, బగ్‌ధారీ డాండ్ గ్రామాల గిరిజనులు ఈ మేరకు నిర్ణయించారు.

### డబ్బు లు పంచిన కాంగ్రెస్ అభ్యర్థి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్‌లో మహువా సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి ఓం ప్రకాశ్ హుడ్లా ఓటరుకు డబ్బులిస్తున్న ఓ వీడియో వైరల్‌గా మారింది. ఓంప్రకాశ్ ఎన్నికల ప్రచారం చేస్తుండగా నీళ్ల బిందెతో వెళుతున్న అమ్మాయి ఆయనకు కనిపించింది. వెంటనే ఆమెకు డబ్బులిచ్చి, ఓటు వేయాలంటూ కాళ్లకు దండం పెట్టి అభ్యర్థించాడు. ఈ ఘటనపై ఈసీ దర్యాప్తు చేయనుంది.



## ఏపీలో ఘోర రైలు ప్రమాదం

**ఎనిమిది మంది మృతి.. 20 మందికి గాయాలు**

**ప్యాసింజర్ రైలును ఢీకొన్న ఎక్స్‌ప్రెస్.. విజయనగరం జిల్లాలో దుర్ఘటన**

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఏపీలోని విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి వద్ద పట్టాలపై ఆగి ఉన్న ఒక రైలును మరో రైలు ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు మరణించగా, దాదాపు 20 మందికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో దవాఖానకి తరలించారు. విశాఖపట్నం నుంచి బయలుదేరిన విశాఖ-రాయగడ ప్యాసింజర్ రైలు ఓవర్ హెడ్ విద్యుత్తు వైర్లు తెగిపోవడంతో పట్టాలపై ఆగిపోయింది. ఆగి ఉన్న ఈ ప్యాసింజర్ రైలును పలాస-విశాఖ ఎక్స్‌ప్రెస్ ఢీకొన్నది. దీంతో రాయగడ ప్యాసింజర్ రైలు చివరి మూడు భోగీలు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలిలో భీతావహ పరిస్థితి నెలకొన్నది. సంఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విద్యుత్తు వైర్లు తెగిపోవడంతో ఘటనా ప్రాంతం అంధకారంగా మారింది. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం అందించాలని ఏపీ సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. రైలు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది.

# కేరళలో వరుస పేలుళ్లు

- కలమస్సేరి క్రిస్టియన్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు పేలుళ్లు
- ఇద్దరు మృతి.. 51 మందికి గాయాలు
- విషమంగా ఆరుగురి పరిస్థితి
- ఉగ్ర కోణంలోనూ దర్యాప్తు: డీజీపీ
- లొంగిపోయిన నిందితుడు



కన్వెన్షన్ సెంటర్‌లో పేలుళ్లు జరగడంతో పరుగులు తీస్తున్న జనం

తిరువనంతపురం/కొచ్చి, అక్టోబర్ 29: కేరళలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో వరుస బాంబు పేలుళ్లు కలకలం రేపాయి. ఎర్నాకుళం జిల్లా కలమస్సేరిలోని 'జెహోవా విట్‌నెసెస్' అనే క్రైస్తవ మత గ్రూపు ప్రజలు సమావేశమైన జమ్రా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన ఈ పేలుళ్ల ఘటనలో ఇద్దరు మహిళలు మరణించగా, మరో 51 మందికి గాయాలయ్యాయి. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. కన్వెన్షన్ హాలులో ప్రార్థనలు ప్రారంభమైన తర్వాత నిమిషాల వ్యవధిలో మూడుసార్లు పేలుళ్లు జరిగాయి. టిఫిన్ బాక్స్‌లో అమర్చిన ఐఈడీ పదార్థంతో పేలుళ్లు జరిపినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఆదివారం ఉదయం 9.40 గంటల సమయంలో ఈ పేలుడు సంభవించిందని రాష్ట్ర డీజీపీ దర్వేశ్ సాహెబ్ వెల్లడించారు. పేలుడు వెనుక ఉగ్ర కుట్ర ఉన్నదా? అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు డీజీపీ స్పందిస్తూ.. ఉగ్ర కోణంతో సహా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, సిట్ దర్యాప్తు తర్వాత అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. ఎన్ఐఏతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా రంగంలోకి దిగాయి. పేలుడు సమయంలో కన్వెన్షన్ సెంటర్‌లో దాదాపు 2,300 మంది ఉన్నారు.

**నేడు అఖిలపక్ష సమావేశం**

పేలుడు ఘటన నేపథ్యంలో అత్యవసరంగా చర్చించేందుకు సీఎం విజయన్ సోమవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కన్వెన్షన్ సెంటర్‌లో పేలుడు ఘటన దురదృష్టకరమని, తీవ్రమైనదని విజయన్ అన్నారు.

**బాంబు అమర్చింది నేనే..!**

బాంబు పేలుళ్లకు తానే బాధ్యుడినంటూ డొమినిక్ మార్టిన్ అనే ఓ వ్యక్తి త్రిసూర్ జిల్లా కొడకారా పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. కలమస్సేరిలో బాంబు అమర్చిన వారిలో తాను కూడా ఒకడినని చెప్పాడని, అందుకు తగిన ఆధారాలు కూడా ఇచ్చాడని అధికారులు తెలిపారు. తాను జెహోవాస్ విట్‌నెసెస్ క్రిస్టియన్ గ్రూపునకు చెందినవాడనని కూడా చెప్పాడని పేర్కొన్నారు. లొంగిపోయేందుకు ముందు మార్టిన్ ఒక వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. తమ సంఘం బోధనలు దేశద్రోహంగా ఉన్నాయని, అందుకే ఈ చర్యకు పాల్పడినట్టు అందులో పేర్కొన్నారు.

**ఎవరీ 'జెహోవాస్ విట్‌నెసెస్'?**

మైనారిటీ క్రైస్తవ గ్రూపు అయిన 'జెహోవాస్ విట్‌నెసెస్' మత సమూహం 19వ శతాబ్దంలో అమెరికా ఉద్భవించింది. చరిత్రకారుల ప్రకారం ఈ మత సమూహం అంతర్జాతీయ బైబిల్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కి చెందిన ఒక విభాగం. దీన్ని చార్లెస్ టజే రస్సెల్ 1872లో పిట్స్‌బర్గ్‌లో స్థాపించాడు. ఈ కమ్యూనిటీ ప్రజలు యేసు ప్రభువును దేవుడిగా కాకుండా దేవుడి కుమారుడిగా భావిస్తున్నారు.

## రోజుకు 9 వేల అడుగులు నడిస్తే దీర్ఘాయుష్షు

న్యూఢిల్లీ: మన నడక తీరు మన ఆయుష్షుపై ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. రోజు నడిచే అడుగులతోపాటు, ఎంత వేగంగా నడుస్తున్నారనేది కూడా ముఖ్యమేనని తెలిపింది. రోజుకు కనీసం 2,500 అడుగులు వేసేవారికి మరణించే ముప్పు 8% తగ్గుతుందని పేర్కొన్నది. అధ్యయనం ప్రకారం.. గుండెపోటు నుంచి తప్పించుకోవాలంటే రోజుకు కనీసం 2,700 అడుగులు వేయాలి. ప్రాణాంతక గుండెజబ్బుల ముప్పు తగ్గాలంటే రోజుకు 7వేల అడుగులు నడవాలి. రోజుకు 9 వేల అడుగులు వేస్తే, మరణ ముప్పు 60 శాతం తగ్గుతుంది.

## సిమ్ స్వాపింగ్ స్కామ్‌తో జాగ్రత్త

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: 'సిమ్ స్వాపింగ్ స్కామ్'లో ఓ ఢిల్లీ మహిళా న్యాయవాది రూ.50 లక్షలు పోగొట్టుకున్నారు. ఢిల్లీ సైబర్ పోలీసుల కథనం ప్రకారం సదరు న్యాయవాదికి ఇటీవల తెలియని నెంబర్ నుంచి మూడు మిస్డ్ కాల్స్ వచ్చాయి. ఆ తర్వాత ఆమె వేరే నెంబర్ నుంచి ఆ తెలియని నెంబర్‌కు కాల్ చేస్తే అవతలి వ్యక్తి కొరియర్ సర్వీస్ నుంచి కాల్ చేశానని చెప్పి ఆమె ఇంటి చిరునామా తీసుకున్నాడు. అంతే.. కొద్ది సేపటికి తన బ్యాంక్ ఖాతా నుంచి రెండు లావాదేవీలు జరిగినట్టు ఆమెకు మేసేజ్‌లు వచ్చాయి. ఈ ఘటనలో ఆమె ఎలాంటి ఓటీపీ షేర్ చేయకపోవడం గమనార్హం.

**ఏమిటీ మోసం..?**

ఇందులో స్కామర్ మీ సిమ్ కార్డ్ యాక్సెస్ పొందుతాడు. తన వద్ద ఉన్న సిమ్ కార్డుకు మీ నెంబర్‌ను లింక్ చేసేలా నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను మోసగిస్తాడు. ఆ తర్వాత చేయాలనుకున్న మోసాన్ని చేసేస్తాడు. ఈ నేపథ్యంలో అనుమానితులకు మీ వివరాలేవీ షేర్ చేయకూడదు. మీ సిమ్ కార్డ్ లాక్ అయితే లేదా 'నో వ్యాలిడ్(చెల్లదు)' అని ఎర్రర్ మేసేజ్ వస్తే వెంటనే మీ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి మీ నంబర్‌ను బ్లాక్ చేయాలి. మీ సిమ్‌ను లాక్ చేసే సదుపాయాన్ని వినియోగించుకోవాలి. దీని ద్వారా మీ యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను బ్లాక్ చేసుకోవాలి. తరచూ మీ పాస్‌వర్డ్‌లను మార్చుతూ ఉండాలి. మీ బ్యాంక్ ఖాతా వివరాలను తరచూ చెక్ చేసుకోవాలి. మోసపూరిత లావాదేవీ జరిగినట్టు తెలిస్తే బ్యాంక్‌కు తెలియజేయాలి.



## ప్రపంచంలోనే తొలి ప్యాసింజర్ ఎయిర్ ట్యాక్సీ

**ఆమోదం తెలిపిన చైనా**

బీజింగ్: ప్రపంచంలోనే మొదటి ప్యాసింజర్ ఎయిర్ ట్యాక్సీకి చైనా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇద్దరు ప్రయాణికుల సామర్థ్యం గల ఈ ఎయిర్ ట్యాక్సీ చైనా ప్రభుత్వం నుంచి భద్రతా ప్రమాణాల ధ్రువీకరణ పత్రాన్ని పొందింది. ఎహంగ్ అనే చైనా కంపెనీ ఈ ఎయిర్ ట్యాక్సీని తయారు చేసింది. త్వరలోనే ఎయిర్ ట్యాక్సీ సేవలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆ కంపెనీ తెలిపింది. కంపెనీ సీఈవో హుయాజీ హు మాట్లాడుతూ రానున్న అయిదేండ్లలో ప్రపంచవ్యాప్తంగా ఎయిర్ ట్యాక్సీలు అనేక నగరాల్లో కనిపించనున్నాయని చెప్పారు. తమ కంపెనీకి ఇప్పటికే 1200 ఆర్డర్లు వచ్చాయని తెలిపారు.

# గాజాలో ఆకలి కేకలు

- గోదాముల్లోకి చొరబడి ఆహారాన్ని ఎత్తుకెళ్తున్న ప్రజలు
- నానాటికీ దిగజారుతున్న పరిస్థితులు
- ఇప్పటివరకు 8 వేల మంది మృతి
- భూతల దాడులను తీవ్రతరం చేసిన ఇజ్రాయెల్ బలగాలు



గాజాలోని ఐక్యరాజ్యసమితి గోదాముల నుంచి సరుకులు తీసుకెళ్తున్న స్థానికులు

డీర్ అల్-బలహ్(గాజా స్ట్రిప్), అక్టోబర్ 29: ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం తీవ్రమవుతున్నది. గాజాను ఇజ్రాయెల్ దిగ్బంధించడంతో అక్కడ పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఆహారం, ఇతర నిత్యావసరాల కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయి. ఆహార సంక్షోభం చుట్టుముడుతున్నది. ఈ క్రమంలో ఆదివారం వేలాది మంది ప్రజలు ఐక్యరాజ్యసమితి గోదాముల్లోకి చొరబడి ఆహార, ఇతర నిత్యావసర పదార్థాలను ఎత్తుకెళ్లారు. గోదాముల్లోకి చొరబడటం ఆందోళనకర అంశమని, ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటుందనడానికి ఇది సంకేతమని ఐక్యరాజ్యసమితి మానవతా విభాగం గాజా డైరెక్టర్ థామస్ పేర్కొన్నారు.

**రెండో దశ యుద్ధం**

గాజాపై రెండో దశ యుద్ధం ప్రారంభించామని.. హమాస్ సైనిక, ప్రభుత్వ సామర్థ్యాలను ధ్వంసం చేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. భూతల, గగన, జల మార్గాల ద్వారా దాడులు కొనసాగిస్తామని తెలిపారు. ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటివరకు 8 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్టు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. ఇజ్రాయెల్ వద్ద బందీగా ఉన్న పాలస్తీనియన్లందరినీ విడిచిపెడితే తమ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను విడిచి పెడతామని హమాస్ అగ్ర చేసిన ప్రతిపాదనను ఇజ్రాయెల్ సైన్యం తిరస్కరించింది. ఇప్పటివరకు కాస్త సురక్షిత ప్రాంతంగా భావిస్తున్న ఉత్తర గాజాపైనా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది.

### సొంతసైన్యంపై నెతన్యాహూ విమర్శలు!

సొంత బలగాలను ఉద్దేశంచి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. హమాస్ దాడిని గుర్తించడంలో ఇంటెలిజెన్స్ విభాగం విఫలమైందని, దాడి గురించి భద్రతాధికారులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై క్యాబినెట్ సహచరులు, రాజకీయ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవడంతో ఆయన భద్రతా బలగాలకు క్షమాపణలు చెప్పారు.